# జీఎస్టీ వసూళ్లు 1.84 లక్షల కోట్లు




### గతంతో పోల్చితే ఫిబ్రవరిలో 9.1 శాతం వృద్ధి

న్యూఢిల్లీ, మార్చి 1: జీఎస్టీ వసూళ్లు మరోసారి భారీ స్థాయిలో నమోదయ్యాయి. ఫిబ్రవరి నెలలో రూ.1.84 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కిందటేడాది ఇదే నెలలో వసూలైన రూ.1.68 లక్షల కోట్లతో పోలిస్తే 9.1 శాతం చొప్పున పెరిగాయని తెలిపింది. దేశీయ వినిమయం పుంజుకోవడం, ఆర్థిక రంగం తిరిగి వృద్ధి బాట పట్టడం వల్లనే జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదవుతునాయని వెల్లడించింది. గత నెలలో వసూలైన రూ.1.84 లక్షల కోట్లలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.35,204 కోట్లు, స్టేట్ జీఎస్టీ కింద రూ.43,704 కోట్లు, ఐజీఎస్టీ కింద రూ.90,870 కోట్లు, పరిహారం సెస్ రూపంలో రూ.13,868 కోట్లు వచ్చాయని పేర్కొంది. జీఎస్టీ వసూళ్లలో దేశీయంగా వచ్చిన ఆదాయం ఏడాది ప్రాతిపదికన 10.2 శాతం ఎగబాకి రూ.1.42 లక్షల కోట్లకు చేరుకోగా, దిగుమతి చేసుకునే వస్తువులపై విధించే పన్ను ద్వారా రూ.41,702 కోట్లు సమకూరాయి. అలాగే రూ.20,889 కోట్ల పన్నును రిఫండ్ రూపంలో చెల్లించింది. ప్రస్తుత సంవత్సరం తొలి నెల జనవరిలో రూ.1.96 లక్షల కోట్ల జీఎస్టీ వసూలయ్యాయి. దీనిపై ఈవై ట్యాక్స్ పార్టనర్ సౌరభ్ అగర్వాల్ మాట్లాడుతూ..దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శణమని, అంతర్జాతీయ దేశాలు అనిశ్చిత పరిస్థితిలో ఉన్నప్పటికీ పన్ను వసూళ్లు ఇంచుమించు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకోవడం విశేషమన్నారు. హర్యానా, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, తమిళనాడు, మధ్యప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో జీఎస్టీ వసూళ్లు 10 శాతం నుంచి 20 శాతం వరకు అధికమవగా, అలాగే తెలంగాణతోపాటు గుజరాత్, అసోం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో 1 శాతం నుంచి 4 శాతం వరకు పెరిగాయి.

# టెస్లాపై ఆశలు వదులుకున్నట్టేనా?

### తీవ్రంగా పోటీపడుతున్న వివిధ రాష్ట్రాలు
### పట్టించుకోని తెలంగాణ సర్కారు
### టెస్లా కోసం గతంలో కృషిచేసిన కేటీఆర్

హైదరాబాద్, మార్చి 1 (నమస్తే తెలంగాణ): లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా భారత్‌లో అడుగుపెడుతున్న నేపథ్యంలో ఆ పెట్టుబడిని రాబట్టేందుకు పలు రాష్ట్రాలు తీవ్రంగా పోటీ పడుతున్నాయి. ఉచిత భూములు, రకరకాల ప్రోత్సాహకాల ఆశ చూపడంతోపాటు తమ రాష్ట్రంలో ఉన్న అనుకూలతలను ఎత్తిచూపుతూ ఎలాగైన పరిశ్రమను దక్కించుకొనేందుకు ఎవరి మార్గాల్లో వారు ప్రయత్నిస్తున్నారు. ఈ పోటీలో తెలంగాణ రాష్ట్రం వెనుకబడిందా? అంటే అవుననే సమధానం వస్తున్నది. టెస్లా ప్లాంటు కోసం రాష్ట్ర సర్కారు అవసరమైన మేరకు ప్రయత్నాలు చేయకపోవడమే ఈ వాదనలకు బలాన్ని చేకూర్చుతున్నది.

టెస్లా కంపెనీని ఆకర్షించేందుకు తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, ఆంధ్రప్రదేశ్ తీవ్రంగా ప్రయత్నిస్తుండగా, కర్ణాటక, తెలంగాణ సైతం రేసులో ఉన్నాయి. తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్‌లలో ఇప్పటికే అనేక ఆటోమొబైల్ పరిశ్రమలు కొనసాగుతుండటం వాటికి కలిసొచ్చే అంశం. ఇప్పటికే పలు ప్రముఖ కార్ల తయారీ కంపెనీలు ఈ రాష్ట్రాల్లో తమ పరిశ్రమలు స్థాపించి ఉత్పత్తులు చేస్తున్నాయి. కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు ఐటీ పరిశ్రమలు అధికంగా ఉండటం కొంత అనుకూలాంశం కాగా, ఈ రెండు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలు కావడం ప్రతికూలాంశమని పరిశ్రమ వర్గాలు చెప్తున్నాయి. పోటీలో ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ మినహా అన్నింటికీ ఓడరేవు ఉంది.



టెస్లా కారుతో కేటీఆర్ (ఫైల్)

దీంతో ఎగుమతి, దిగుమతులకు ఈ రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నాయి. అన్నిటికి మించి మన రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో టెస్లాతో సంప్రదింపులు జరిపినప్పటికీ అనంతరం ఆ ప్రయత్నాలను కొనసాగించకుండా వదిలేసిందని అంటున్నారు. ముఖ్యంగా ఓడరేవు లేకపోవడం, ఎన్డీఏ కూటమిలోని రాష్ట్రాలతో మనం పోటీ పడే అవకాశం లేదనే భావన ప్రభుత్వ వర్గాల్లో ఉన్నట్టు తెలిసింది.

ఇదిలావుండగా, దాదాపు నాలుగేండ్ల క్రితం టెస్లా కార్ల తయారీ కంపెనీ భారత్‌కు వస్తున్నట్టు సంకేతాలు వెలువడిన వెంటనే అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ దాన్ని తెలంగాణకు వచ్చే విధంగా తీవ్రంగా కృషిచేశారు. నిరంతరం కంపెనీ వర్గాలతో సంప్రదింపులు జరపడమే కాకుండా ఇతర రాష్ట్రాలను తలదన్నే విధంగా తాము ప్రోత్సాహకాలు ఇస్తామని కంపెనీ వర్గాలకు సమాచారం అందించారు. దీంతో తెలంగాణ గట్టి పోటీదారుగా ఎదగడమే కాకుండా టెస్లా భారత్‌కు వస్తే అది తెలంగాణలో ఏర్పాటు ఖాయమనే ప్రచారం అప్పట్లో జరిగింది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వ మార్పుతో అంచనాలు తారుమారయ్యాయని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన సందర్భంగా టెస్లా కంపెనీ అధినేత ఎలాన్ మస్క్‌తో సమావేశమైన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సుంకాలతోపాటు పరిశ్రమ ఏర్పాటుకు కావాల్సిన సహకారంపై ఆయన లేవనెత్తిన అంశాలకు ప్రధాని సానుకూలంగా స్పందించడంతో టెస్లా కంపెనీ భారత్ రాకకు మార్గం సుగమమైంది. అంతేకాదు, ఇప్పటికే తమకు అవసరమైన ఉద్యోగుల నియామకం కూడా టెస్లా చేపట్టింది. సుమారు 500మిలియన్ డాలర్లతో మొదటి దశ పెట్టుబడితో ప్లాంటు ఏర్పాటునకు టెస్లా సిద్ధమవుతున్నది.

# వాహన అమ్మకాలు అంతంతే

న్యూఢిల్లీ, మార్చి 1: వాహన ఉత్పత్తి సంస్థలకు ఫిబ్రవరి నెల షాకిచ్చింది. ధరలను పెంచుతూ వాహన ఉత్పత్తి సంస్థలు తీసుకున్న నిర్ణయంతో కొనుగోలుదారులు వెనుకంజవేశారు. కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ అమ్మకాలు స్వల్పంగా పెరరగా.. హ్యుందాయ్, టాటా మోటర్స్ సేల్స్ భారీగా తగ్గాయి. వాహనాలకు డిమాండ్ పడిపోవడం వల్లనే తగ్గాయని కంపెనీ ప్రతినిధులు వెల్లడించారు. మరోవైపు, మహీంద్రా, టయోటా కిర్లోస్కర్‌లు రెండంకెల వృద్ధిని నమోదు చేసుకున్నాయి. దేశవ్యాప్తంగా రాజకీయ సవాళ్లు ఉన్నప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో పన్ను సంస్కరణలు, లిక్విడిటీని పెంచడానికి తీసుకున్న నిర్ణయాలు భవిష్యత్తులో డిమాండ్‌ను పెంచుతాయన్న విశ్వాసాన్ని హ్యుందాయ్ మోటర్ సీఈవో తరుణ్ గార్గ్ వ్యక్తంచేశారు.

**ఫిబ్రవరిలో వాహన విక్రయాలు**

| సంస్థ | 2025 | 2024 | వృద్ధి |
|---|---|---|---|
| మారుతి | 1,99,400 | 1,97,471 | స్వల్పంగా |
| హ్యుందాయ్ | 58,727 | 60,501 | -3 |
| మహీంద్రా | 83,702 | 72,923 | 15 |
| టయోటా | 28,414 | 25,220 | 13 |
| టాటా మోటర్స్ | 79,344 | 86,406 | -8 |
| కియా ఇండియా | 25,026 | 20,200 | 24 |
| హోండా కార్స్ | 10,323 | 13,078 | -21 |



## ఎన్టీపీసీ దూకుడు

న్యూఢిల్లీ: విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఎన్టీపీసీ రికార్డు సృష్టించింది. ఇప్పటి వరకు 400 బిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసింది. కేవలం ఈ మైలురాయికి చేరుకోవడానికి సంస్థ 335 రోజులు పట్టింది. అంతక్రితం ఏడాది కంటే 12 రోజులు ముందుగానే ఈ మైలురాయికి చేరుకోవడం విశేషం. 2023-24లో మార్చి 13న ఈ కీలక మైలురాయికి చేరుకున్నది. దేశీయంగా వినియోగిస్తున్న విద్యుత్‌లో నాలుగోవంతు సంస్థ ఉత్పత్తి చేస్తున్నదే కావడం విశేషం. ప్రస్తుతం సంస్థ 77 గిగావాట్ల విద్యుత్ సామర్థ్యం కలిగివుండగా, మరో 29.5 గిగావాట్ల విద్యుత్ యూనిట్లు నిర్మాణదశలో ఉన్నాయి.




## ఎన్ఎండీసీ ఉత్పత్తి హైజంప్

హైదరాబాద్, మార్చి 1: ఖనిజ ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఎన్ఎండీసీ ఆశాజనక పనితీరు కనబరిచింది. ఫిబ్రవరి నెలలో సంస్థ 4.62 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 3.98 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో ఉత్పత్తైన ఖనిజంతో పోలిస్తే 18 శాతం వృద్ధిని కనబరిచినట్లు కంపెనీ సీఎండీ అమితవ ముఖర్జీ తెలిపారు. ఒక నెలలో ఇంతటి స్థాయిలో ఖనిజాన్ని ఉత్పత్తి చేయడం కూడా కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు సంస్థ 40.49 మిలియన్ టన్నుల ఖనిజాన్ని ఉత్పత్తి చేయగా, 40.20 మిలియన్ టన్నుల ఖనిజాన్ని విక్రయించింది. వచ్చే ఏడాది నూతన గనులు అందుబాటులోకి వస్తుండటంతో ఖనిజ ఉత్పత్తి మరింత పెరిగే అవకాశాలున్నాయన్నారు.

# ఎంఎస్ఎంఈల మనుగడ ప్రశ్నార్థకం

- మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా మారాలి
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్, మార్చి 1(నమస్తే తెలంగాణ): మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా ఎంఎస్ఎంఈలు, ఎస్ఎంఈలు మారాలని, లేదంటే రాబోయే రోజుల్లో వీటి మనుగడ ప్రశ్నార్థకంగా మారనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ప్రస్తుత కృత్రిమ మేధ(ఏఐ) యుగంలోనూ పాత ఆలోచనలతో సంప్రదాయబద్ధంగా ముందుకెళ్తే తప్పా మనగడే ప్రశ్నార్థకంగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని, ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు ఈ విషయంలో అప్రమత్తంగా, ప్రజలు కోరుకుంటున్న విధంగా కొత్తగా ఆలోచించాలని ఆయన సూచించారు. ది ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించిన 'సమ్మిట్ ఆన్ ఫ్యూచర్-రెడీ ఇండస్ట్రీ ట్రాన్సఫర్మేషన్: ఇన్నోవేటింగ్ ఫర్ గ్రోథ్ ఎఫిషీయన్సీ అండ్ సెక్యూరిటీ(గ్రోథ్ ఎక్స్2025)' సదస్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..టెక్నాలజీ రోజురోజుకి కొత్త పుంతలు తొక్కుతున్నదని,



ఎఫ్‌టీసీసీఐ ఆధ్వర్యంలో జరిగిన సదస్సుకు హాజరైన మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

ముఖ్యంగా ఏఐ అందుబాటులోకి రావడంతో అన్ని రంగాల్లోనూ అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయి..అలాగే అనేక సవాళ్లు కూడా ఎదురవుతున్నాయన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా మన ఆలోచన తీరు మారాలని ఆయన పేర్కొన్నారు. సమాజం ఎదుర్కొంటున్న ఎన్నో సవాళ్లకు ఏఐ, క్వాంటమ్, మెషిన్ లెర్నింగ్ తదితర అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరిష్కారాలను చూపొంచవచ్చని, ఆ దిశగా ఆవిష్కర్తలు కొత్తగా ఆలోచించాలని కోరారు. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. అభివృద్ధి విషయంలో ఇతర రాష్ట్రాలకు ధీటుగా తెలంగాణ అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్నదని, సాఫ్ట్‌వేర్ ఎగుమతుల్లో తెలంగాణ వృద్ధి రేటు 17.98 శాతం కాగా జాతీయ సగటు 8 శాతం మాత్రమేనని, ఐటీ రంగంలో తెలంగాణ సత్తా ఏంటో చెప్పడానికి ఇదే నిదర్శనమని మంత్రి అన్నారు.

**6 నుంచి చర్లపల్లిలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో**

ఈ నెల 6 నుంచి 8 వరకు చర్లపల్లి ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ ఎక్స్‌పో-2025 ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో 106 స్టాల్స్‌ను నెలకొల్పుతున్నట్లు, వాటిలో వివిధ పరిశ్రమలు తయారు చేస్తున్న ఉత్పత్తులను, సేవలను ప్రదర్శించనున్నట్లు వారు చెప్పారు.




## అల్ట్రాటెక్‌లో కేశోరాం విలీనం

పాలకుర్తి, మార్చి 1: ఆదిత్యా బిర్లా గ్రూపునకు చెందిన అల్ట్రాటెక్ సిమెంట్‌లో బీకే బిర్లా గ్రూపునకు చెందిన కేశోరాం సిమెంట్ విలీనమయ్యాయి. ఇందుకు సంబంధించి పెద్దపల్లి జిల్లాలోని పాలకుర్తి మండలం బసంత్‌నగర్ వద్ద ఉన్న యూనిట్‌లో ఇందుకు సంబంధించి అధికారిక కార్యక్రమం నిర్వహించారు. సుమారు 50 ఏండ్ల క్రితం ఉత్తర తెలంగాణలోని బసంత్ నగర్‌లో బీకే బిర్లా సిమెంట్ ప్లాంట్‌ను నెలకొల్పారు. ఆతర్వాతి క్రమంలో ఇక్కడే కేశోరాం సిమెంట్‌ను ఉత్పత్తి చేశారు. ప్రస్తుతం ఈ కేశోరాం సిమెంట్‌ను ఆదిత్యా బిర్లా గ్రూపు కొనుగోలు చేయడంతో ఇక నుంచి ఈ ప్లాంట్‌లో అల్ట్రాటెక్ సిమెంట్‌ను ఉత్పత్తి చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఇందుకు సంబంధించి శనివారం ఈ యూనిట్‌లో కార్మికులు, గుర్తింపు కార్మిక సంఘం నాయకులు, ఉద్యోగులతో సమావేశం ఏర్పాటుచేసి, అధికారికంగా అల్ట్రాటెక్ లోగోను ఆవిష్కరించారు.

## రూ.7,861 ధర పలికిన కందులు

నారాయణపేట టౌన్, మార్చి 1 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం 18 క్వింటాళ్ల తెల్లకందులు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.7,861, కనిష్ఠంగా రూ.6,880 ధర పలికాయి. అదేవిధంగా 241 క్వింటాళ్ల ఎర్రకందులు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.7,585, కనిష్ఠంగా రూ.5,329 ధర పలికాయి. 5 క్వింటాళ్ల శనిగలు విక్రయానికి రాగా క్వింటా రూ.5,755 ధర పలికాయి. 104 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.6,160, కనిష్ఠంగా రూ.3,920 ధర పలికాయి. 42 క్వింటాళ్ల జొన్నలు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.4,021, కనిష్ఠంగా రూ.3,012 ధర పలికాయి. 10 క్వింటాళ్ల అలసందలు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.6,671, కనిష్ఠంగా రూ.6,609 ధర పలికాయి. 3 క్వింటాళ్ల తెల్లకుసుమలు విక్రయానికి రాగా క్వింటా రూ.5,201 ధర పలికాయి. 19 క్వింటాళ్ల చింతపండు విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.8,040, కనిష్ఠంగా రూ.5,011 ధర పలికినట్లు యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

## రాయితీ పంట రుణాల పరిమితి పెంపు



వీసీలో వ్యవసాయ, పశు సంవర్ధకశాఖ, బ్యాంకు అధికారులు

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, మార్చి 1 : రాయితీపై ఇస్తున్న పంట రుణాల పరిమితిని రూ.3లక్షల నుంచి రూ.5లక్షలకు పెంచుతున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రకటించారని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వెంకటేశ్ తెలిపారు. ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాల్లో భాగంగా శనివారం హన్వాడ మండలం టంకర రైతు వేదికలో జరిగిన రైతులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రధాని నరేంద్రమోదీ ఈ ప్రకటన చేశారని తెలిపారు. మార్టిగేజ్ లేకుండా బ్యాంకులు ఇచ్చే పంట రుణాల పరిమితిని కూడా వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.1.60లక్షల నుంచి రూ.2లక్షలకు పెంచుతున్నట్లు ప్రకటించారని పేర్కొన్నారు. జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి మధుసూదన్‌గౌడ్, ఎల్‌డీఎం కల్వ భాస్కర్, మండల స్థాయి వ్యవసాయ, పశు సంవర్ధక, మత్స్యశాఖ అధికారులు, బ్యాంకు మేనేజర్లు, రైతులు పాల్గొన్నారు.

## అక్రమాలపై చట్టపరమైన చర్యలు



మహిళా సంఘాల్లో జరిగిన అక్రమాలపై విచారణ చేస్తున్న అధికారులు

మహ్మదాబాద్, మార్చి 1 : మండలంలోని కంచన్‌పల్లి మహిళా సంఘాల్లో జరిగిన అక్రమాలపై చట్టపరమైన చర్యలు ఉంటాయని బీఎల్ డైరెక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. శనివారం కంచన్‌పల్లిలో రెండు గ్రూపుల్లో మహిళా సభ్యులు తీసుకున్న రుణాల్లో పలు అక్రమాలు జరిగినట్లు అధికారులకు గ్రామస్తుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టరీత్యా చర్యలు ఉంటాయని, ఇది మహిళా సమాఖ్య అధికారుల నిర్లక్ష్యమేనని పేర్కొన్నారు. గ్రూపులు యథావిధిగా కొనసాగించాలని మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు మేనేజర్ నర్సింహస్వామి, పీఈ వెంకట్, ఏపీడీ జోజప్ప, డీపీఎం సలోమి, ఏపీఎంలు సునీత, బాలకృష్ణ, రాందాస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

# సంస్కృతి సంప్రదాయాల వెనుక శాస్త్రీయ కారణాలు

- ఆకట్టుకున్న ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల విశ్లేషణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, మార్చి 1 : మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాల వెనుక ఉన్న శాస్త్రీయ కారణాలను ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థినులు విశ్లేషించారు. శనివారం ఆ కళాశాల ఆడిటోరియంలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో భారతీయ వారసత్వం, సంస్కృతికి సంబంధించిన సంప్రదాయాల వెనుక ఉన్న శాస్త్రీయతపై లైఫ్ సైన్సెస్ విద్యార్థినులే వక్తలుగా ప్రసంగించారు. శాస్త్రీయ కారణాలను పవర పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. మహిళలు సింధూరం ఎందుకు ధరిస్తారు..? తులసి మొక్కను ఎందుకు ఆరాధిస్తాము.? గాజులు ఎందుకు ధరిస్తారు.? వజూ, నమాజ్ చేయడం, ఇలా అనేక రకాలైన అంశాలు, వాటి వెనుక దాగున్న శాస్త్రీయ కారణాలు విశ్లేషించి విషదీకరించారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మ అనురాధ, అమీనా ముంతాజ్ జహాన్ మాట్లాడుతూ రామన్ ఎఫెక్ట్ పేరుతో 1928 ఫిబ్రవరి 28న సీవీరామన్ తన పరిశోధనలను ప్రతిపాదించారని ఆ రోజును గుర్తు చేసుకుంటూ దేశ ప్రజలలో వైజ్ఞానిక దినంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీదేవి, పీజీ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కుమార్, జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు మధుసూదన్, నసీం భాను, శ్రీలత, వెంకటరమణమూర్తి, మల్లేశ్ పాల్గొన్నారు.




విద్యార్థినులతో జంతుశాస్త్ర విభాగం అధ్యాపకులు

## రోడ్డుపై మొసలి ప్రత్యక్షం

కృష్ణ, మార్చి 1 : మండలంలోని గుడెబల్లూర్ రోడ్డుపై శుక్రవారం రాత్రి మొసలి ప్రత్యక్షమైంది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. కొందరు అక్కడకు చేరుకొని మొసలిని చెరువులోకి వెళ్లేలా చేశారు. ఊర చెరువులో నాలుగు మొసళ్లు ఉండడంతో కాపర్లు పశువులు, గొర్రెలతో అటువైపు వెళ్లడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొసళ్లను బంధించి కృష్ణానదిలో వదలాలని కోరారు.

## బీసీల గొంతునొక్కేందుకే మల్లన్నను సస్పెండ్ చేశారు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 1 : బీసీల గొంతునొక్కేందుకే కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ తీన్మామార్ మల్లన్నను ఆ పార్టీ అగ్రనాయకులు సస్పెండ్ చేయించారని బీసీ సమాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌సాగర్ శనివారం ప్రకటనలో ఆరోపించారు. బీసీ కులగణన విషయంలో బీసీలకు జరిగిన అన్యాయాన్ని ఎత్తుచూపినందుకే మల్లన్నను సస్పెండ్ చేయడాని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. భవిష్యత్‌లో మల్లన్న నిర్ణయానికి బీసీ సమాజ్ కట్టుబడి ఉంటుందన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట, మార్చి 1 : మండల కేంద్రం హనుమాండ్ల గడ్డ కాలనీకి చెందిన కొంకలి మల్లయ్య (40) మృతి చెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. పార్టీ మండల మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు కర్రోళ్ల స్వప్న రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా పరామర్శించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి అందజేసిన రూ. 5వేల ఆర్థిక సాయం మృతుడి కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుండ్రాతి రాజేశ్‌గౌడ్ నాయకులు భాస్కర్, శరత్ బాబు, వినోద్, శివ ఉన్నారు.

## పరీక్ష సామగ్రి పంపిణీ

మల్దకల్, మార్చి 1 : మండల ంలోని బిజ్వారం జెడ్పీ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శనివారం కవి, రచయిత ఆవని శ్రీ పరీక్ష ప్యాడ్లు, కంపాక్స్ బాక్సులు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆవనీశ్రీ మాట్లాడుతూ భవిష్యత్‌కు పదోతరగతి ఎంతో పునాది అని అన్నారు. అనంతరం హెచ్ఎం మహేశ్ దాత అవనిశ్రీని అభినందించారు. కార్యక్రమంలో కృష్ణకుమారి, శ్రీనివాస్, సతీశ్‌కుమార్, రత్నమాల, తిరుమలేశ్ పాల్గొన్నారు.

## పాఠశాలలో మాదిరి ఎన్నికలు

నారాయణపేట టౌన్, మార్చి 1 : పట్టణంలోని హంసవాహిని ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థులకు మాదిరి ఎన్నికలు నిర్వహించి ఎన్నికల ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పదో తరగతికి చెందిన అక్షయ, దీపిక, నితిన్, శిరీషలు ఎన్నికల పోటీలో నిలబడగా, 6 నుంచి 10 తరగతులకు చెందిన విద్యార్థులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేశ్‌కుమార్ ఓటు ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజేశ్‌కుమార్, ఉపాధ్యాయులు సుజాత, నమ్రత, అమల, తిరుపతి, షమీనా, విజయ, సౌజన్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఓటు వేస్తున్న విద్యార్థిని

## రైతుకు సులభరీతిలో రుణ సదుపాయం

ధరూరు, మార్చి 1: రైతులకు సులభమైన రీతీలో రుణ సదుపాయం అందించడమే కేంద్ర వ్యవసాయ బడ్జెట్ ప్రధాన లక్ష్యమని ఎల్‌డీఎం అయ్యపురెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదిక భవన్‌లో శనివారం కేంద్ర బడ్జెట్ ప్రకటనల అమలు గురించి చర్చించడానికి వ్యవసాయం , గ్రామీణ బడ్జెట్‌పై వెబినార్ నిర్వహించారు. వ్యవసాయం, రైతు సంక్షేమం శాఖ నుంచి వివిధ విభాగాల కార్యదర్శులు అధ్యక్షత వహించారు. ఆర్‌బీఐ, నాబార్డ్, షెడ్యూల్డ్ కమర్షియల్ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు, రాష్ట్ర సహకార సంస్థలు, జిల్లా కేంద్ర సహకార సంస్థలు అందించే రుణాలుపై వెబినార్ ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఏవో సక్రియానాయక్, ఎంఏవో శ్రీలత, ఏఈవోలు పాల్గొన్నారు.

## సరైన విద్యతో మెరుగైన సమాజం

నారాయణపేట, మార్చి 1 : సరైన విద్యతోనే మెరుగైన సమాజం నిర్మితమవుతుందని పీపీ సురేశ్, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ లక్ష్మీపతిగౌడ్, నాగేశ్వరీ అన్నా రు. శనివారం పట్టణంలోని సింగారం చౌరస్తా వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాల ల హక్కుల దుర్వినియోగం, పిల్లల అక్రమ రవాణా, ఆరోగ్యం, విద్య తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అంతకు ముందు త్రిపస్‌పల్లి వద్ద రైతులు, గ్రామస్తులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

**అభ్యసన సామర్థ్యాలు పెంచాలి**

పాన్‌గల్, మార్చి 1: విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పెంచాలని ఎంఈవో శ్రీనివాసులు అన్నారు. మండలంలోని చింతకుంట ప్రాథమిక పాఠశాలను శనివారం ఎంఈవో తనిఖీ చేశారు. ఈసందర్భంగా తరగతి గదిలో విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలు పరీక్షించారు. అనంతరం పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్‌లో గొంగూర, పాలకూర, బీరకాయ, సోరకాయ, బొప్పాయి తోటలను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పచ్చటి మొక్కలతో నిండి ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడిందన్నారు. దాతల సహకారం తో పాఠశాలకు కావాల్సిన సామగ్రిని సమకూర్చుకోవడం ఆనందదాయకమన్నారు. చదువులో వెనుకబ డిన విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.



## బాధిత కుటుంబానికి పరామర్శ

గోపాల్‌పేట, మార్చి 1 : మండల కేంద్రం హనుమాండ్ల గడ్డ కాలనీకి చెందిన కొంకలి మల్లయ్య (40) మృతి చెందగా, శనివారం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. పార్టీ మండల మహిళా కమిటీ ఉపాధ్యక్షురాలు కర్రోళ్ల స్వప్న రూ. 5వేల ఆర్థిక సాయం అందజేశారు. అదే విధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా పరామర్శించారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి అందజేసిన రూ. 5వేల ఆర్థిక సాయం మృతుడి కుటుంబానికి అందజేశారు. పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గుండ్రాతి రాజేశ్‌గౌడ్; భాస్కర్, శరత్ బాబు, వినోద్, శివ ఉన్నారు.

## ఉపాధి పనులపై గ్రామ సభ

అయిజ రూరల్ , మార్చి 1 : మండలంలోని వెంకటాపురం గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో శనివారం స్టేట్ రిసోర్స్ పర్సన్ బాలునాయక్ ఆధ్వర్యంలో ఉపాధిహామీ పనులపై గ్రామసభ నిర్వహించారు. ఇందులో భాగంగా 2023-24 ఏడాదిలో గ్రామంలో జరిగిన ఉపాధి హామీ పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 4వ తేదీన అయిజ మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సోషల్ ఆడిట్‌లో నివేదికను అందజేయాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. సమావేశంలో జిల్లా రిసోర్స్ పర్సన్ శివశంకర్, పంచాయతీ కార్యదర్శి స్వాతి, ఫీల్డ్ అసిస్టెంట్ దేవదాసు, గ్రామస్తులు పాల్గొన్నారు.


## చలివేంద్రం ప్రారంభం

మక్తల్, మార్చి 1 : వేసవి తరుణంలో జాతీయ రహదారిపై బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నీరటి ఓం ప్రకాశ్ తెలిపారు. శనివారం అయన విలేకరులతో మాట్లాడుతూ మక్తల్ మండలం జక్లేర్ గ్రామం 167 జాతీయ రహదారిపై తన తండ్రి రామకృష్ణ జ్ఞాపకార్థకంగా చలివేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీరేశ్వర్‌రెడ్డి, లక్ష్మీనరసింహ, వెంకటేశ్‌గౌడ్, నర్సింహులు, రషీద్, బాలు, శేఖరయ్య, కేశవ్, కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బక్స్ పంపిణీ

దామరగిద్ద, మార్చి 1 : మండలంలోని సజనాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన ఐలెన్సిస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బ్యాగులు, వాటర్‌బాటిల్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ కోఆర్డినేటర్ మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుపై శ్రద్ధ వహించి తల్లిదండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు దీక్షిత, సబ్రమణ్యం, ఉపాధ్యాయులు, మాజీ సర్పంచ్ కన్కప్ప పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

ఖిల్లాఘణపురం, మార్చి 1: వనపర్తి మండలం చిట్యాల గురుకుల పాఠశాలలో శనివారం నిర్వహించిన సైన్స్ అండ్ గణిత మేళాలో ఖిల్లాఘణపురం మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి తెలిపారు. పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు అక్షిత, అనిత, ప్రసన్న పాల్గొని ప్రతిభ కనబర్చి సర్టిఫికెట్లు పొందినట్లు చెప్పారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, గ్యైడ్ టీచర్స్ మమత, విజయకుమార్‌లను ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## 71వసారి రక్తదానం చేసిన యువకుడు

వనపర్తి, మార్చి 1(నమస్తే తెలంగాణ) : యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం కొండూరు ప్రభాకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ద్యానం ప్రవీణ్ 71వ సారి రక్తదానం చేశారు. రక్తదానం చేయడం ఎంతో ఉన్నతమైన ఆశయమని, ప్రవీణ్‌ను నేటితరం యువకులు ఆదర్శంగా తీసుకోవాలని బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ కోరారు.